క్లుప్తంగా

అగ్ని ప్రమాద బాధితులకు చెక్కుల అందజేత



చెక్కు అందజేస్తున్న అధికారులు

ఏన్కూరు: అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన మండల పరిధిలోని టీఎల్‌పేట గ్రామానికి చెందిన బాధితులకు మంజూరైన చెక్కులను తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు మంగళవారం స్థానిక తహసీల్‌లో అందజేశారు. ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కార్యాలయం నుంచి రూ.లక్ష మంజూరవ్వగా నాలుగు కుటుంబాలకు రూ.25 వేల చొప్పున అందజేశారు. ఆర్ఐ నవీన్, వరుణ్, శివ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వెంకటరెడ్డి, తదితరులు

మధిర: మడుపల్లిలో వేంచేసి ఉన్న శ్రీ పద్మావతి అలివేలుమంగ సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం బ్రహ్మోత్సవాల కరపత్రాలను మంగళవారం భరత్ విద్యా సంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల 19 నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమై 29న ముగుస్తాయన్నారు. 28న స్వామి వారి శాంతి కల్యాణ మహోత్సవం, అనంతరం మహా అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలన

ముదిగొండ: మండలంలోని గోకినేపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలను మంగళవారం జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి కె.రవికుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల ఆవరణ, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమైన ఆయన విద్యార్థుల హాజరుశాతం పెంపు, మెనూ అమలుపై సూచనలు చేశారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



భోజనం వడ్డిస్తున్న దాతలు

మధిరరూరల్: మండల పరిధిలోని ఆత్కూరు క్రాస్ రోడ్డులో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం భక్తులకు అన్నదానం చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు రేగళ్ల బ్రహ్మారెడ్డి, సునీత దంపతుల ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన నిర్వహణ కమిటీ బాధ్యులు వెలగపూడి హనుమంతరావు, డాలు కృష్ణ ఉన్నారు.

నోట్ పుస్తకాల వితరణ

తల్లాడ: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు దగ్గుల ప్రభాకరెడ్డి నోట్ పుస్తకాలు వితరణగా అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు బెల్లంకొండ ఆంజనేయులు, కార్యదర్శి వెంకటేశ్వరరావు, కోశాధికారి వెంకట్‌రెడ్డి, వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, మురళీ, ఉపాధ్యాయులు ఉన్నారు. అదేవిధంగా మల్లవరం గ్రామంలో కూలీలకు లయన్ పోరెడ్డి గోపాల్‌రెడ్డి జన్మదినం సందర్భంగా అన్నదానం నిర్వహించారు.

కాంట్రాక్టర్‌ను అరెస్టు చేయాలి

వైరా: వైరాలో మత్స్యకారుడిపై దాడి చేసిన కాంట్రాక్టర్ జిలానీని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ... విక్రయదారుల ఒప్పందంతో ఏర్పాడిన కాంట్రాక్టు వ్యవస్థలను వెంటనే రద్దు చేయాలని, మత్స్యకారులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా దొరికిన చేపలను మత్స్యకారులు స్వేచ్ఛగా, స్వతంత్రంగా విక్రయాలు చేసుకునేలా సహకరించాలన్నారు.

22న చలో హైదరాబాద్

కొణిజర్ల: కొత్త రేషన్‌కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో ఈ నెల 22న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు సీవై.పుల్లయ్య పిలుపునిచ్చారు. మండలంలోని రామ నరసయ్యనగర్‌లో మంగళవారం పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. నాయకులు పాశం అప్పారావు, అర్జునరావు, తడికమళ్ల సీతారాములు, గడ్డం లక్ష్మణ్, అప్పారావు, సుభద్ర, మల్లికాంబ, రాంబాబు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగమేనా..

అలంకారప్రాయంగా వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డు

- శిథిలావస్థకు చేరిన గోదాం, ప్లాట్‌ఫాం
- అడవిని తలపిస్తున్న ఆవరణ





సబ్ మార్కెట్‌యార్డు (ఇన్‌సెట్) కంప చెట్లతో నిండిన ఆవరణ..



శిథిలావస్థలో ఉన్న గోదాం

బోనకల్: మండల కేంద్రంలో రైతుల సౌకర్యార్థం నిర్మించిన వ్యవసాయ సబ్ మార్కెట్‌యార్డు నిరుపయోగంగా దర్శనమిస్తోంది. 2010లో మధిర మార్కెట్‌యార్డుకు అనుసంధానంగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వెనుక బోనకల్-ఖమ్మం ప్రధాన రహదారి పక్కన రూ.10 లక్షల వ్యయంతో అప్పటి మధిర ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ మల్లు భట్టి విక్రమార్క మార్కెట్‌యార్డును ప్రారంభించారు. మండలంలోని 22 గ్రామాల ప్రజలు మార్కెట్ సబ్ యార్డును ఉపయోగించుకోవాలని సూచించారు. కొద్దిరోజుల పాటు రైతులు పండించిన పంటను మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కొనుగోళ్లు నిర్వహించారు. కొన్ని రోజుల తర్వాత కొనుగోళ్లు నిలిపివేయడంతో రైతులు మధిర, ఖమ్మం మార్కెట్‌లకు వెళ్లి పంటలను అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అధ్వానంగా గోదాం.. ప్లాట్‌ఫాం..

పంట కొనుగోలు చేసిన తర్వాత వాటిని నిల్వచేసేందుకు గోదాంలను సైతం నిర్మించారు. ఆ గోదాంను ఉపయోగించకపోవడంతో శిథిలావస్థకు చేరింది. గోదాం పైభాగం రేకులు పగిలిపోయాయి. దీంతో వర్షపు నీరు గోదాంలోకి చేరుతుండడంతో ధాన్యాన్ని నిల్వ చేసే పరిస్థితి లేకుండా పోయింది. అదేవిధంగా రూ.2 లక్షల వ్యయంతో రైతుల పంటలను ఆరబెట్టుకునేందుకు ప్లాట్‌ఫాంను నిర్మించారు. ప్రస్తుతం ఆ ఫ్లాట్‌పాంపై పిచ్చిమొక్కలు మొలిచి పగుళ్లు ఏర్పడ్డాయి.

ముళ్లకంపలతో ఆవరణం..

సబ్‌మార్కెట్ యార్డు ఆవరణం చెట్లతో, ముళ్లకంపతో నిండి ఉంది. లక్షలాది రూపాయలతో నిర్మించిన వ్యవసాయ సబ్ మార్కెట్‌యార్డు నిరుపయోగంగా దర్శనమిస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి దూరప్రాంతాలకు వెళ్లకుండా మార్కెట్ యార్డు ప్రారంభించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



పగుళ్లు వచ్చిన ప్లాట్‌ఫాం

కొనుగోళ్లు ప్రారంభించాలి



బోనకల్‌లో సబ్ మార్కెట్ యార్డులో కొనుగోళ్లు ప్రారంభించాలి. పండించిన పంటలను సబ్ మార్కెట్‌యార్డులో అమ్ముకోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తప్పుతుంది. దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి రావడంతో రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవాల్సి వస్తుంది.

– శాస్త్రీ, ముష్టికుంట్ల, రైతు

పని దొరుకుతుంది..



సబ్ మార్కెట్‌యార్డులో కొనుగోళ్లు ప్రారంభిస్తే హమాలీలకు పనిదొరుకుతుంది. రైతులు వారు పండించిన పంటలను ఇక్కడే అమ్ముకునే వీలు కలుగుతుంది. తద్వారా రవాణా చార్జీలు తగ్గుతాయి. హమాలీలకు కూడా రోజు పనిదొరకడం వలన పని కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోతుంది.

– కిన్నెర భూపాల్, హమాలీ, చిరునోముల

క్రీడలతో మానసికోల్లాసం..



పరిచయం చేసుకుంటున్న జహీరుద్దీన్

కారేపల్లి: క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు, మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అలవరుతాయని జిల్లా గిరిజన సంక్షేమ సహాయ అధికారి (ఏటీడీఓ) షేక్ జహీరుద్దీన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రేలకాయలపల్లి ఆశ్రమపాఠశాలలో స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఆటలో గెలుపోటములు సహజమని, ఓటములను అనుభవంగా చేసుకొని, గెలుపునకు సాధన చేసి సాధించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎల్.రాములు, వార్డెన్ వీరన్న, పీఈటీ డి.వీరన్న, ఉపాధ్యాయులు డీఎస్ నాగేశ్వరరావు, వెంకటేష్, సక్రాం, దేవ్‌సింగ్, మాన్‌సింగ్, రాంబాబు, సీహెచ్ వెంకటేశ్వర్లు, తార, పద్మ, సక్రాం తదితరులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా కార్యక్రమం

మధిర: హర్ ఘర్ తిరంగ్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం మధిర పట్టణంలోని దళిత కాలనీలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నాయకులు చిలివేరు సాంబశివరావు, పాపట్ల రమేష్, గుండా చంద్రశేఖర్ రెడ్డి, మర్సకట్ల స్వర్ణాకర్, జనార్ధన్, కోటయ్య, ఏసు పవన్ పాల్గొన్నారు.

ఏన్కూరు: బీజేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు జాతీయ జెండాలు పంపిణీ చేశారు. విద్యార్థులు జెండాలు పట్టుకొని ర్యాలీగా తరలివెళ్లి ప్రధాన సెంటర్ మానవహారం నిర్వహించారు. నల్లమోతుల రమేష్, నాగేశ్వరరావు, మోరబోయిన కృష్ణ పాల్గొన్నారు.

సంఘం బలోపేతానికి కృషి



సభ్యత్వాన్ని అందజేస్తున్న రమణారెడ్డి

బోనకల్: ఇరిగేషన్ ఎంప్లాయిస్ యూనియన్ బలోపేతానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, శ్రీనివాసరావు కోరారు. మండల కేంద్రంలోని ఇరిగేషన్ కార్యాలయంలో సంఘం సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తవారికి సంఘ సభ్యత్వాన్ని అందజేశారు. నాయకులు వెంకటేశ్వర్లు, సైదులు, ఇరిగేషన్ డీఈలు రామకృష్ణ, తమ్మారపు వెంకటేశ్వర్లు, ఏఈ కూరపాటి రాజేష్ పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో చదవండి..

సత్తుపల్లిటౌన్: క్రమశిక్షణ అలవర్చుకొని విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.గోపి అన్నారు. మంగళవారం కళాశాలలో ఆర్ట్స్ విభాగంలో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు వీడ్కోలు, కొత్త విద్యార్థులకు స్వాగత వేడుకలు నిర్వహించారు.

వ్యాసరచన పోటీలు



ప్రశంసా పత్రాలతో విద్యార్థినులు

వైరారూరల్: మండలంలోని రెబ్బవరం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థినులకు మంగళవారం 'స్మార్ట్ ఇండియా' ఏర్పాటులో యువత పాత్ర అనే అంశం మీద టీసీఎస్ ఉద్యోగి వేల్పుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలు గెలుపొందిన వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం-నరసింహారావుపేట మధ్య మంగళవారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. తల్లాడ నుంచి బుల్లిబాబు అనే వ్యక్తి బైక్‌పై స్వగ్రామమైన ఏన్కూరు మండలం గార్లొడ్డు వెళ్తుండగా ఎదురుగా వచ్చి ఆటో ఢీకొనడంతో ఆయన కాలు విరగడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. బుల్లిబాబు గతంలో తల్లాడ ఎస్బీఐలో అటెండర్‌గా పని చేశాడు. ఆయనను 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం



తల్లాడ: బదిలీ అయిన ఉద్యోగులు



కల్లూరురూరల్: ఐసీడీఎస్ కార్యాలయంలో..

తల్లాడ: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం బదిలీ అయిన ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ చంద్రమౌళి, ఎంపీఓ కె.శ్రీదేవి వారికి పూల మాలలు, శాలువాలతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం కోటయ్య, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బదిలీపై వెళ్తున్న వైద్యసిబ్బందిని వైద్యాధికారి రత్నమనోహర్ ఆధ్వర్యంలో సన్మానించారు. డాక్టర్ ఆల్తాఫ్, డాక్టర్ శ్రీకాంత్, మహేష్, గోపి, శిరీష, శ్రీను, సీహెచ్‌ఓ భాస్కర్, సూపర్‌వైజర్లు పెద్ద పుల్లయ్య, కమల, భద్రమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరురూరల్: బదిలీపై వెళ్తున్న కల్లూరులోని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బందిని ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఐసీడీఎస్ సీడీపీఓ నిర్మలజ్యోతి, ఏసీడీపీఓ రత్నమ్మ, రహీమున్నిసాబేగం, సూపర్‌వైజర్లు సంధ్య, సుజాత, భవాని తదితరులు ఉన్నారు.

ముగిసిన 'న్యాస్' శిక్షణ



శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో ఎంఈఓ

సత్తుపల్లి: నవంబర్ నెలలో నిర్వహించే జాతీయ సాధన సర్వే పరీక్ష కోసం ఉపాధ్యాయులకు స్థానిక జ్యోతి నిలయం పాఠశాలలో నిర్వహిస్తున్న న్యాస్ శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఎంఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... విద్యార్థుల్లో సామర్థ్యాలను మెరుగుపరచాలన్నారు. కోర్సు డైరెక్టర్ రాజేశ్వరరావు, చెన్నకేశవరెడ్డి, మధుసూదనాచారి, వేణుగోపాల్‌రెడ్డి, చీకటి బాలాజీ, రవికుమార్, వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పూర్వ ప్రాథమిక విద్య అమలు



మాట్లాడుతున్న కనకదుర్గ

సత్తుపల్లిటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను పకడ్బందీగా అమలు చేయాలని సత్తుపల్లి ఐసీడీఎస్ సీడీపీఓ కనకదుర్గ అన్నారు. కాకర్లపల్లి రైతువేదికలో మంగళవారం జరిగిన ప్రాజెక్టు సమావేశంలో ఆమె మాట్లాడారు. సూపర్‌వైజర్లు యు.మహాలక్ష్మీ, గంగాజలం, వసంత, రమాదేవి, సుజాత, రజిని, కమల, సత్తుపల్లి, వేంసూరు మండలాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు వితరణ

ఎమ్మెల్యే మట్టా రాగమయి పుట్టినరోజు సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ ఐసీడీఎస్‌కు నోట్‌పుస్తకాలు అందజేశారు. సత్తుపల్లి, కల్లూరు సీడీపీఓలు కనకదుర్గా, నిర్మలజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యంపై అవగాహన పెంచుకోవాలి

చింతకాని: విద్యార్థులు సాహిత్యంపై అవగాహన పెంచుకోవాలని బాలసాహితీ వేత్త సయ్యద్ షఫీ అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మంగళవారం బాల సాహిత్య కార్యశాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కొండ్రు బ్రహ్మం, కన్నెగంటి వెంకటయ్య, నామా పురుషోత్తం, రాచమళ్ల ఉపేందర్, దాసరోజు శ్రీనివాస్,హెచ్‌ఎం బీవీఆర్ శర్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

బోనకల్: పోగొట్టుకున్న ఫోన్‌ను బాధితుడికి మంగళవారం పోలీసులు అందజేశారు. బోనకల్‌కు చెందిన 108లో పనిచేస్తున్న మనోహర్ ఈ నెల 3న ఫోన్ పోగొట్టుకోగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఫోన్‌ను కనుక్కొని బాధితుడికి అందజేసినట్లు ఎస్సై మధుబాబు తెలిపారు.

స్వయం ఉపాధితోనే మహిళల ఆర్థికాభివృద్ధి

- ఎమ్మెల్యే రాగమయి



సత్తుపల్లిరూరల్: యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాగమయి



ముదిగొండ: గోకినేపల్లిలో..

సత్తుపల్లిరూరల్: స్వయం ఉపాధితో మహిళలు ప్రభుత్వ పథకాలను వినియోగించుకుంటూ ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. మంగళవారం సత్తుపల్లి మండలంలోని బుగ్గపాడులో ఐకేపీ ద్వారా ఇందిరా మహిళా శక్తిలో భాగంగా పలు యూనిట్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఐకేపీ ద్వారా ఇందిరా మహిళా శక్తి పథకంలో ఒక్కో యూనిట్ రూ.2 లక్షలు నుంచి రూ.3లక్షలు ఖరీదు చేసే యూనిట్లను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం సుబ్బారావు, సీసీలు నరేంద్ర, శ్రీనివాస్, రామారావు, కృష్ణయ్య, వివోఏలు పాల్గొన్నారు.

ముదిగొండ: మహిళా శక్తి యూనిట్లతో మహిళలు ఆర్థికంగా ఎదగవచ్చని అడిషనల్ డీఆర్‌డీఓ నూరుద్దీన్ అన్నారు. మండలపరిధిలోని వల్లభి, వనంవారి కిష్టాపురం, గోకినేపల్లిలలో మహిళా శక్తి యూనిట్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, సీసీలు, గ్రామదీపికలు, వీఓలు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: మండలంలోని ములుగుమాడు, సఖినవీడు గ్రామాల్లో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మంజూరైన యూనిట్లను మాజీ సర్పంచ్ గంటా తిరుపతమ్మ, మధిర ఏఎంసీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ ప్రారంభించారు. ఐకేపీ సీసీ టి.రమాదేవి, గ్రామ దీపికలు వెంకటేశ్వరమ్మ, సునీత, పద్మావతి, సైదమ్మ, నాయకులు రామకోటేశ్వరరావు, వెంకటనారాయణ తదితరులున్నారు.

సీఎం సభను జయప్రదం చేయాలి

- ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



వైరా: నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: వైరాలో గురువారం జరగనున్న సీఎం రేవంత్ రెడ్డి సభను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో భాగంగా డప్పులు కొట్టి.. స్టెప్పులు వేసి అందరిని ఉత్తేజపరిచారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి వైరా నుంచే రూ.2 లక్షల రుణమాఫీని అమలు చేసి రైతులను విముక్తులు చేయనున్న నేపథ్యాన రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర హస్తకళల చైర్మన్ నాయుడు సత్యనారాయణ, మార్కెఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి కట్ల రంగారావు, వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, కోసూరి శ్రీను, దాసరి దానియేలు, పణితి సైదులు సూర్యదేవర శ్రీధర్, కొప్పురావూరి సుమంత్, దార్నా రాజశేఖర్, పమ్మి అశోక్ పాల్గొన్నారు.

కల్లూరు/పెనుబల్లి: సీఎం రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. ఈ మేరకు కల్లూరు ఏఎంసీ కార్యాలయంలో, పెనుబల్లిలో ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్లూరులో ఏఎంసీ చైర్మన్ నీరజాదేవి, నాయకులు భాగం ప్రభాకర్ చౌదరి, ఏనుగు సత్యంబాబు, సత్యనారాయణరెడ్డి, నారపురెడ్డి, యాకూబ్ అలీ, నరసింహారావు, కృష్ణ, శ్రీమన్నారాయణ, శేషగిరిరావు, మోహన్‌రావు, శ్రీకాంత్ పాల్గొన్నారు. పెనుబల్లిలో వెంకటేశ్వరరావు, రామారావు, సోమరాజు, శ్రీనివాసరెడ్డి, కోటేశ్వరరావు ఉన్నారు.

వైరారూరల్: సీఎం రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని మాజీ జెడ్పీటీసీలు బొర్రా ఉమాదేవి, నంబూరి కనకదుర్గ మండలంలోని కేజీ సిరిపురంలో ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ మట్టూరి సత్యప్రసన్నాంభ, కౌన్సిలర్లు పణితి ఉషారాణి, లక్ష్మీబాయి, పోటు శ్రీదేవి, తుమ్మల విజయ కుమారి, సింగు భవాని పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: వైరాలో నిర్వహించనున్న సీఎంసభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండలాధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, పీసీసీ మెంబర్ శీలం ప్రతాపరెడ్డిలు మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కోరారు. నాయకులు నర్సింహారావు, నాగిరెడ్డి, శ్రీనివాసరావు, పుల్లారెడ్డి, లక్ష్మణరావు, తదితరులున్నారు.

నాణ్యమైన విద్య బోధించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ ప్రభాకర్‌రావు

ఎర్రుపాలెం: విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఉపాధ్యాయులు బోధించాలని ఎంఈఓ వై.ప్రభాకర్ రావు కోరారు. మంగళవారం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహించిన జాతీయ సాధన సర్వే-2024 శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జీవీఎన్ రాజు, రిసోర్స్ పర్సన్లు పాటి బాలకృష్ణ, నర్సింహారావు, పాండురాజు, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతను నివారించాలి

ఏన్కూరు: యుక్త వయస్సులోనే రక్తహీనత నివారించాలని ప్రభుత్వ వైద్యాధికారి బి.రాములు అన్నారు. స్థానిక పభుత్వ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశాడే సందర్భంగా పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

వైరారూరల్: వైరా మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆశాడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. సిబ్బంది సయ్యద్ సమ్రీన్, పి. ప్రమీల, సరిత, సఖి తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తి సభ్యులకు శిక్షణ

కల్లూరురూరల్: కల్లూరులోని సెర్ప్, ఉషోదయ మండల సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరా మహిళా శక్తి సభ్యులకు వ్యవసాయ అనుబంధ రంగాలు, పశు పోషణపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం వెంకటరామారావు, యూనియన్ బ్యాంక్ మేనేజర్ నరేంద్ర, వెటర్నరీ డాక్టర్ మమత, సమాఖ్య పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మించాలని రాస్తారోకో

సత్తుపల్లి: సత్తుపల్లిలోని తమ్మిలేరు బ్రిడ్జి స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ బీజేపీ నాయకులు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నాయుడు రాఘవరావు మాట్లాడుతూ... ప్రస్తుతం ఉన్న తమ్మిలేరు బ్రిడ్జి శిథిలావస్థకు చేరిందని, బ్రిడ్జి ఇరుకుగా ఉండటంతో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణ, మండల అధ్యక్షుడు పాలకొల్లు శ్రీనివాసరావు, నాగస్వామి, వసంతరావు, శివ, విజయ్, శేషగిరి, నర్సింహారావు, సుభాని, అశోక్ పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

తల్లాడ: మండలంలోని బిల్లుపాడులో వ్యక్తిపై దాడి చేయటంతో మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై కొండల్‌రావు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యలమర్తి కుటుంబరావు నారపోగు ప్రసాద్‌పై దాడి చేయగా కుటుంబరావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా నారపోగు ప్రసాద్ రేషన్ వద్దకు వచ్చి తాను రిపోర్టర్ అని బిల్లుపాడు రేషన్ డీలర్ మానుపాటి మధును డబ్బులివ్వాలని బెదిరించడంతో మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రుణాలు పంపిణీ

ముదిగొండ: రుణాలు పొందుతున్న రైతులు పంటలకు సద్వినియోగం చేసుకోవాలని ముదిగొండ సహకార సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి అన్నారు. ముదిగొండలో సహకార సొసైటీ కార్యాలయంలో మంగళవారం రుణాలు మాఫీ అయిన రైతులకురుణాల చెక్కులు అందజేశారు. డీసీసీబీ మేనేజర్ అలేఖ్య, సీఈఓ వెంకటరత్నం, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలో పెద్దగోపవరం సొసైటీ పరిధిలోని ఋమాఫీ పొందిన రైతులందరికీ రుణాలను బ్యాంకు మేనేజర్ దివ్య, సొసైటీ చైర్మన్ శీలం అక్కిరెడ్డిలు అందజేశారు. సీఈఓ వీరారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

మధ్యాహ్న భోజన పథకాన్ని హరేరామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు అప్పగించడాన్ని నిరసిస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు మంగళవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. వెంటనే ఆ ప్రతిపాదనలు విరమించుకోవాలని కోరుతూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ఏన్కూరు: ధర్నా చేస్తున్న కార్మికులు



చింతకాని: వినతిపత్రం అందజేత..



కారేపల్లిలో..